విద్య..అంతా మిథ్య

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో గత ప్రభుత్వం విద్యాసంస్కరణలు ప్రవేశపెట్టింది. అయితే కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోంది. ముఖ్యంగా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. బడులు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా నేటికీ విద్యార్థులకు పూర్తి స్థాయిలో విద్యా కానుక కిట్లను అందించలేదు. దీనికి తోడు సరిపడా ఉపాధ్యాయుల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం టీచర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినా టీడీపీ నాయకులు కుట్రతో దాన్ని అడ్డుకున్నారు. ఆఖరికి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఉపాధ్యాయులను బదిలీ ప్రక్రియను చేపట్టేందుకు యత్నించగా దానికీ మోకాలడ్డటంతో పరిస్థితులు దారుణంగా మారాయి.

– కళ్యాణదుర్గం/రాయదుర్గం/ఉరవకొండ:

- నాడు ప్రథమం...నేడు అథమం
- విద్యపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- నేటికీ బడి పిల్లలకు అందని యూనిఫాం
- పాత యూనిఫాంతోనే పాఠశాలలకు వస్తున్న విద్యార్థులు
- ఉపాధ్యాయుల కొరతతో నాణ్యమైన విద్యకు దూరమవుతున్న పిల్లలు



చీకులగురికి పాఠశాలకు యూనిఫాంలు ఇవ్వకపోవడంతో కలర్ దుస్తుల్లో వచ్చిన విద్యార్థులు

☛ ఈచిత్రం ఆరుబయట మధ్యాహ్న భోజనం తింటున్న చిన్నారులు చీకులగురికి ప్రభుత్వ పాఠశాలకు చెందిన వారు. ఇక్కడ పిల్లలకు స్కూల్ యూనిఫాంలు ఇవ్వకపోవడంతో అందరూ సాధారణ దుస్తులు వేసుకొని పాఠశాలకు వస్తున్నారు.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మొత్తం 73 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో కళ్యాణదుర్గం అర్బన్‌లో 8, రూరల్ పరిధిలో 9, కంబదూరులో 15, కుందుర్పిలో 22, శెట్టూరులో 8, బ్రహ్మసముద్రంలో 11 చొప్పున ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. శెట్టూరు మండలంలో బచ్చేహళ్లి, తిప్పనపల్లి, కనుకూరు గ్రామాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్ ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉంది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇప్పటికీ ఖాళీలు భర్తీ చేయలేదు. దీంతో ఈ ఏడాది ఆయా పాఠశాలల్లో ఇంగ్లిష్ సబ్జెక్టు బోధన పూర్తిగా నిలిచిపోయింది.

నేటికీ ఇవ్వని యూనిఫాం..

కళ్యాణదుర్గం నియోజకవర్గవ్యాప్తంగా 269 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 35,535 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత ఏడాది పాఠశాలల పునఃప్రారంభం జూన్ 12 నాటికి విద్యార్థులకు అందించాల్సిన విద్యా కానుక కిట్లను అందజేసేవారు. అయితే ఈ సారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటినా నేటికీ విద్యా కానుక కిట్లను అందించలేదు. కొన్ని చోట్ల బుక్స్, బూట్లు, బ్యాగులు ఇవ్వకపోగా నియోజకవర్గంలో ఎక్కడా కూడా కొత్త యూనిఫాం పంపిణీ చేయలేదు.

ఉరవకొండ ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 3 నుంచి 10 వతరగతి వరకు 1,050 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో 41 మంది ఉపాధ్యాయ పోస్టులు ఉండగా ఇక్కడ 25 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. దీంతో ఒక్కో ఉపాధ్యాయుడు రెండు తరగతులు క్లబ్ చేసి పాఠాలు బోధిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు విద్యాసంవత్సరం ప్రారంభం అయి రెండు నెలలు గడస్తున్నా.. నేటికీ 58శాతం మంది విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందలేదు. నియోజకవర్గంలో స్కూల్ యూనిఫాంలు అందక విద్యార్థులు పాత యూనిఫాంలనే వేసుకోని స్కూల్స్‌కు వస్తున్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇంకా చాలా పెండింగ్‌లో పెట్టడంతో విద్యార్థుల చదువులకు తీవ్ర అవరోధం కలుగుతోంది. నియోజకవర్గంలో వంద పాఠశాల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో రెండు క్లాసులను క్లబ్ చేసి ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు.

రాయదుర్గం..

రాయదుర్గం నియోజకవర్గంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలన్నీ కలిపి 285 ఉన్నాయి. ఇందులో 48,195 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే పాఠశాలలు పునఃప్రారంభం కాగానే గత వైఎస్సార్ సీపీ హయాంలో విద్యాకానుక కిట్లు పూర్తిగా అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తొలి ఏడాదిలోనే విద్యార్థులకు కష్టాలు మొదలయ్యాయి. యూనిఫాం, డిక్షనరీలు వంటివి నేటికీ అందించలేదు.

ఉరవకొండ నియోజకవర్గంలోని
మొత్తం పాఠశాలల సంఖ్య: 223
మొత్తం విద్యార్థుల సంఖ్య: 34,800
మధ్యాహ్న భోజన ఏజెన్సీల సంఖ్య: 223
స్కూల్ కిట్లు అందని విద్యార్థుల శాతం: 58

ఏజెన్సీల మార్పుతో రుచితప్పిన భోజనం..

గడిచిన వైఎస్సార్‌సీపీ హయాంలో నాణ్యత ప్రమాణాలు కూడిన విద్యతో పాటు పిల్లల ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా రోజు కోమెనూ తో పాటు గుడ్డు, పాలు, చిక్కీ లాంటి పౌష్టికాహారం అందించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిపై దృష్టి సారించకుండా నేతల సంపదపై కన్నేశారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని 285 ఏజెన్సీలను నిర్దాక్షిణ్యంగా తొలగించి, టీడీపీ అనుయాయులకు కట్టబెట్టారు. 60 శాతం పాఠశాలల్లో నాణ్యత లేని భోజనం అందుతుండడంతో విద్యార్థులకు ముద్ద దిగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముద్దన్నం, నీళ్ల చారుతోనే చాలా మంది ఏజెన్సీలు సరిపెట్టేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. టీచర్ల బదిలీల సర్దుబాటుకు బ్రేక్ పడడంతో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఉదాహరణకు పట్టణంలోని అభ్యుదయ పాఠశాలలో 291 మంది విద్యార్థులుంటే 16 మంది ఉపాధ్యాయులు ఉండాలి. అయితే ఇక్కడ ఒక్కరుంటే ఒట్టు. డిప్యుటేషన్‌పై ముగ్గురు ఉపాధ్యాయులను పంపి అరకొర ఉపాధ్యాయులతోనే నెట్టుకొస్తున్నారు. ఇలాంటి పాఠశాలలు మరిన్ని ఉన్నట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ కారణంగా విద్యావ్యవస్థ కుంటుపడే స్థితికి చేరింది.



☛ ఈచిత్రం విడపనకల్లు మండలం చీకులగురికి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనిది. విద్యార్థులకు గత రెండు నెలల నుంచి ఏజెన్సీల మార్పు అవుతాయన్న ప్రచారంతో విద్యార్థులకు ముద్ద అన్నం, నీళ్ల చారు వడ్డిస్తున్నారు. దీంతో విద్యార్థులు నాణ్యమైన భోజనానికి దూరమవుతున్నారు.

పిల్లలకు నాణ్యమైన భోజనం అందివ్వాలి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లాగే పాఠశాలకు వచ్చే విద్యార్థులందరికీ నాణ్యమైన భోజనం అందించాలి. చిక్కీలు, పాలు, గుడ్లు, అరటి పండు లాంటి పౌష్టికాహారం ఇవ్వాలి. విద్యావ్యవస్థలపై పటిష్ట మార్పులు కొనసాగించాలి. నాడు–నేడుతో ఆగిన భవనాలన్నీ పూర్తిచేయాలి. విద్యార్థులకు అందాల్సిన విద్యా కానుక కిట్లలో యూనిఫాం, డిక్షనరీలు వెంటనే ఇవ్వాలి. మాట ప్రకారం తల్లికి వందనం అందించాలి.

– రామాంజనేయరెడ్డి, ఉంతకల్లు గ్రామం, బొమ్మనహాళ్

ఇబ్బందులు పడుతున్నాం



గత ప్రభుత్వంలో విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యాకానుక కిట్లు అందజేశారు. ప్రస్తుతం ఇంకా మాకు యూనిఫాం, డిక్షనరీ ఇవ్వాల్సి ఉంది. పాఠశాలలోనూ గదుల కొరత ఉంది. అదనపు గదుల నిర్మాణం పూర్తయి ఉంటే సమస్య ఉండేది కాదు.

– బీ.అక్షయ, పదో తరగతి, కేజీబీవీ, కణేకల్లు

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య, విద్యాకానుక కిట్ల పంపిణీ వివరాలు..

మండలం	మొత్తం పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య	ఏజెన్సీలు
కళ్యాణదుర్గం అర్బన్	15	4,332	16
కళ్యాణదుర్గం రూరల్	44	6,832	40
కంబదూరు	58	5,098	58
కుందుర్పి	53	6,764	64
శెట్టూరు	56	5,831	50
బ్రహ్మసముద్రం	43	6,678	42
మొత్తం	269	35,535	270

రాయదుర్గం నియోజకవర్గంలోని పాఠశాలల వివరాలు

మండలం	మొత్తం పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య	ఏజెన్సీలు
రాయదుర్గంఅర్బన్	40	7,680	40
రాయదుర్గం మండలం	38	6,220	38
డి హీరేహాళ్	48	8,816	48
కణేకల్లు	53	8,221	53
బొమ్మనహాళ్	50	8,998	50
గుమ్మఘట్ట	56	8,260	56
మొత్తం	285	48,195	285



రాయదుర్గంలో అభ్యుదయ పాఠశాలలో గదులు, ఉపాధ్యాయుల కొరతతో వరండాలో చదువుకుంటున్న విద్యార్థులు

క్లుప్తంగా

చదువుతోనే సమాజాభివృద్ధి



ప్రతిభాపురస్కారాలు అందిస్తున్న ఎమ్మెల్యే కాలవ, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: చదువుతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీచౌడేశ్వరీదేవి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్ పరీక్షలకు ఉత్తమ ఫలితాలు సాధించిన తొగట వీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ జరిగింది. అతిథులు ఎమ్మెల్యే కాలవ, మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప, ఎంఈఓ–2 వెంకటరమేష్ చేతుల మీదుగా ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన పోలా కస్తూరి, శంకర అన్నపూర్ణ, గోరంట్ల శ్రీపల్లవి, పదో తరగతిలో గట్టు తేజశ్రీ, గట్టు సాత్విక నాగసాయి, భరత్‌కుమార్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి, తొగటవీర క్షత్రియ విద్యా సంక్షేమ సంఘం మద్దిలేటి ప్రభాకర, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, కౌన్సిలర్లు అరవరేఖ, ప్రశాంతి, లక్ష్మీ, శారదదేవి, పైతోట సంజీవప్ప, ఆలయ కమిటీ ధర్మకర్త గట్టు శ్రీరాములు, సభ్యులు హనుమంతు, సత్యనారాయణ, లోకేష్, రాజు శివప్ప, కండే నాగరాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

అందని రేషన్

శెట్టూరు: మండలంలోని శెట్టూరు, బసంపల్లి, ములేకలడు, ఖైరేవు, బచ్చేహళ్లి, యాటకల్లు గ్రామ పంచాయతీల్లో ఈనెలలో ఇప్పటివరకూ రేషన్ సరుకులు అందలేదు. నిత్యావసర సరుకులు అందకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో కొందరు పేదలు ఒక టోతేదీనే రేషన్ సరుకులు అందుతాయని ఎదురు చూస్తుంటారు. ప్రభుత్వం రాయితీతో ఇచ్చే బియ్యం సమయానికి అందకపోతే కూలి డబ్బులతో కిరాణా దుకాణంలో కొనాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పలుచోట్ల డీలర్ల తొలగించడం, మరికొందరిపై స్వచ్ఛందంగా తొలగిపోవాలని కూటమి నాయకులు హుకుం జారీ చేస్తున్నారు. కొన్నిచోట్ల కొత్తగా వచ్చిన డీలర్లకు పూర్తి స్థాయిలో పంపిణీకి సంబంధించిన సామగ్రి లేక, ఇతర కారణాలతో రేషన్ సరుకులు పేదలకు అందించలేదు.

చిక్కణ్ణేశ్వరుడికి పూజలు



ప్రత్యేక పూజలందుకొన్న చిక్కణ్ణేశ్వరస్వామి

కణేకల్లు: కణేకల్లులోని చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకం, పంచామృతాభిషేకం, మంగళహారతి, మహామంగళారతి, ఆకుపూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు జరిపించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఓర్వలేక ఆరోపణలు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం: రాజకీయంగా తన ఎదుగుదలను ఓర్వలేకే తనపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని కొండాపురం మాజీ సర్పంచు అనిల్‌చౌదరి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తాను అతి చిన్న వయస్సులోనే రాజకీయంగా ఎదగడం చాలా మందికి నచ్చలేదన్నారు. దీంతోనే తనకు సంబంధం లేని విషయాల్లో తన ప్రమేయం ఉన్నట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గ్రామాభివృద్ధికి తాను ఎంతగానో కృషి చేశానన్నారు. పీర్ల చావిడికి సుమారు 60 అడుగుల తన సొంతం స్థలం ఇచ్చానని, పీర్ల చావిడికి తన కుటుంబం ఏకంగా రూ.2.50 లక్షలు సొంత నిధులు ఖర్చు చేశామన్నారు. కేవలం గ్రామంలో తాను అంటే గిట్టని వారు అనవసరంగా రాద్ధాంతం చేస్తూ తన ఎదుగుదలకు అడ్డుపడుతున్నారని వాపోయారు. తాను ఒక విద్యార్థి సంఘం నాయకుడిగా ఎదిగి తాలూకా సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారంటే తాను ఏంటో పార్టీ పెద్దలకు తెలుసని చెప్పారు.

వైద్యశిబిరానికి స్పందన



కణేకల్లులో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

కణేకల్లు: కణేకల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరానికి స్పందన లభించింది. స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి కళ్యాణ మంటపంలో నిర్వహించిన వైద్యశిబిరంలో గైనకాలజిస్ట్ చిట్టా శ్రీలక్ష్మీ, ఆర్థోపెడిక్ డాక్టర్ ప్రదీప్, డెర్మటాలజిస్ట్ డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డితోపాటు పలువురు డాక్టర్లు 200 మందికి పరీక్షలు చేసినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేలూరు మరియప్ప తెలిపారు. కణేకల్లు మండల లయన్స్‌క్లబ్ కార్యదర్శి చాంద్‌బాషా, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌గుప్తా, కోశాధికారి మాబుసాబ్, సభ్యులు ఆనంద్‌రాజ్ తోపాటు గోపాల్, అశోక, మహేష్, శరబన్నగౌడ్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి జయంత్యుత్సవాలు



ఉరవకొండలో విశేష అలంకరణలో దర్శనమిస్తున్న ఉరగాద్రి చౌడేశ్వరి అమ్మవారు



ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వను సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్త శరత్



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ఉరవకొండ: పట్టణంలోని అన్ని చౌడేశ్వరీ ఆలయాల్లో చౌడేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉరగాద్రి చౌడేశ్వరి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, మహా మంగళహారతి, కుంకమార్చన జరిగింది. అనంతరం ఆలయ ధర్మకర్త కొత్తశరత్ ఆధ్వర్యంలో అమ్మవారి పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఉరగాద్రి చౌడేశ్వరీని దర్శించుకున్న ప్రముఖులు: ఉరగాద్రి చౌడేశ్వరి అమ్మవారిని ఎమ్మెల్సీ వై.శివ రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారిరంగయ్య ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు అందించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కొత్త శరత్, కొత్తలక్ష్మిదేవి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే, ఎంపీలకు ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలు అందించారు. ఉరవకొండ అర్బన్ సీఐ సురేష్‌బాబు, ప్రభుత్వాస్పత్రి వైద్యాధికాధికారులు డాక్టర్ సాక్షి, డాక్టర్ అర్జున్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓబన్న, వీరన్న, తిప్పయ్య, గోవిందు, బసవ రాజు, నిమ్మల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని నేసేపేటలో వెలసిన చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, అష్టోత్తర నామావళి, కుంకుమార్చన జరపగా, వందలాది మంది మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం అమ్మవారికి మహా మంగళహారతి నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి సహస్రలలిత నామార్చన నిర్వహించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, ఆలయ ధర్మకర్త గట్టు శ్రీరాములు, అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు మద్దిలేటి ప్రభాకర, ప్రధాన కార్యదర్శి హనుమంతు, కోశాధికారులు సత్యనారాయణ, గుద్దేటి లోకేష్ తదితరులు పాల్గొని పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య



అమ్మవారికి ఒడిబియ్యం సమర్పిస్తున్న మహిళలు

నగరేశ్వరస్వామి ఆలయంలో అమావాస్య పూజలు



ఆలయంలో నగరేశ్వరస్వామిని అలంకరించిన దృశ్యం

వజ్రకరూరు: స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకా లు, రుద్రాభిషేకం, అర్చనలు, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, ప్రత్యేక అలంకరణ తదితర కార్యక్ర మాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకొని స్వామిని దర్శించుకుని అన్నదానాన్ని స్వీకరించారు.



ఆలయంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి

కంబదూరు: మండలంలోని కదిరిదేవరపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అంగడి నాగన్న (74) అనారోగ్యంతో మృతి చెందాడు. నాగన్న వైఎస్సార్‌సీపీని స్థాపించినప్పటి నుంచి పార్టీలో క్రియాశీలకంగా పని చేశాడు. అయితే ఇటీవల అనారోగ్యానికి గురైన నాగన్న.. శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. నాగన్న మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవింద్, హనుమంతరాయుడు, నాయకులు తిమ్మరాయుడు, సాయినాథ్‌రెడ్డి, చిన్న చిత్తప్ప, మాసప్ప,కిష్టప్ప తదితరులు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిత్యావసర సరుకులు అందజేత



ఆశ్రయ అనాథాశ్రమంలో సరుకులు అందిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: వజ్రకరూరుకు చెందిన పంచాయతీ వార్డు సభ్యుడు, ఏపీ రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి అనంతపురం సమీపంలోని కాటిగానికాలువలోని ఆశ్రయ అనాథాశ్రమానికి ఆదివారం నిత్యావసర సరుకులు అందించాడు. ఎమ్మెల్సీ వై.శివ రామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవి జ్ఞాపకార్థం రూ.30వేల విలువజేసే నిత్యావసర సరుకులు అందించాడు. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ శివ రామిరెడ్డి సతీమణి, స్వర్గీయ వై.ఉమాదేవి అనేక సేవా కార్యక్రమాలు చేశారని, పేదలకు ఆర్థికసాయం అందించారని గుర్తు చేశాడు. కార్యక్రమంలో ఏపీరెడ్డి సంఘం నాయకులు పాటిల్ రామకృష్ణారెడ్డి, చవ్వా హనుమంతరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కుమ్మెత సోమిరెడ్డి, శ్రీరామరెడ్డి, సత్తిరెడ్డి, పాముదుర్తి వెంకటరెడ్డి, అరవిందరెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయి కథల పోటీలకు 'నాన్న సంతకం'

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన రచయిత కామిశెట్టి చంద్రమౌళి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. తెలుగు సాహిత్యానికి పెద్ద పీట వేస్తూ నిర్వహించబడిన ప్రతిష్టాత్మక తటవర్తి భారతి స్మారక ప్రపంచ స్థాయి కథల పోటీలకు చంద్రమౌళి రాసిన 'నాన్న సంతకం' కథను ఎంపిక చేశారు. చంద్రమౌళి పెద్దవడుగూరు మండలం లక్ష్మంపల్లిలో సైన్స్ టీచర్‌గా పనిచేస్తూనే కవిగా, రచయితగా కథలు, కవితలు రాశారు. గతంలో రెండు అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు.



ఫ్రెండ్ షిప్‌డే సందర్భంగా సమ్మేళనమైన 1979–80 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

పూర్వ విద్యార్థుల దాతృత్వం

కూడేరు: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కూడేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1979–80 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో కలిశారు. ఒకరికొకరు మిత్రుల దినోత్సవ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అక్కడే భోజనాలు చేసి, సరదాగా ముచ్చట్లు చెప్పుకుంటూ గడిపారు. జూన్ 30న ఈ పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించినప్పుడు మనం చదువుకున్న పాఠశాలకు గుర్తుగా తమవంతు సాయం చేద్దామని తలిచారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా రూ.1.50 లక్షలు పెట్టి వేదిక (మీటింగ్ స్టేజ్) షెడ్‌ను ఏర్పాటు చేయించారు.

ఒకే ఈతలో రెండు ఆవుదూడలు



కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని బోయలపల్లిలో ఆవు ఒకే ఈతలో రెండు దూడలను ఆదివారం ఈనింది. రైతు విక్రమ్‌కు సుమారుగా 60 ఆవులు ఉన్నాయి. అందులోని ఒక ఆవు రెండు పైదూడలకు ఈనింది.

శాకంబరి అలంకరణలో అమ్మవారు



కంబదూరులో శాకంబరి అలంకరణలో అమ్మవారు

కంబదూరు: ఆషాఢమాసంలో చివరి రోజు కావడంతో ఆదివారం మండల కేంద్రంలోని కన్యపరమేశ్వరి ఆలయంలో శాకంబరి అలంకరణలో అమ్మవారు దర్శణమిచ్చారు. సాయంత్రం ఆర్యవైశ్యులు అమ్మవారిని వెజిటబుల్స్‌తో ప్రత్యేకంగా ఆలంకరించి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.